మహిళా సాధికారతే జగనన్న లక్ష్యం

- పథకాల లబ్ధి మొత్తం మహిళల ఖాతాల్లోనే
- రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించండి
- ఎన్నికల ప్రచారంలో బియ్యపు పవిత్రారెడ్డి


కుక్కలగుంటలో పవిత్రారెడ్డికి ఆత్మీయ స్వాగతం


సంక్షేమ బావుటా బుక్‌లెట్లు అందజేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

ఏర్పేడు: మహిళా సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ రేణిగుంట మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కుక్కలగుంట, మర్రిమందలో సిద్ధం కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో ఆమెకు గ్రామస్తులు ఆత్మీయ స్వాగతం పలికారు. ఆమె ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగనన్న సంక్షేమ పథకాలను మహిళల పేరిట అమలు చేస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారని వివరించారు. చంద్రబాబు నాయుడు రుణ మాఫీ, సున్నా వడ్డీ అమలు చేస్తామని 2019 ఎన్నికల ముందు హామీ ఇచ్చి వాటిని అమలు చేయకుండా అక్కచెల్లెమ్మలను మోసం చేసారని ఆరోపించారు. సీఎం జగనన్న ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ నేరవేర్చినట్లు చెప్పారు. నవరత్న పథకాల ద్వారా పేదల ఆర్థికాభివృద్ధికి జగనన్న కృషిచేస్తున్నారని పేర్కొన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. గతంలో పింఛన్ కావాలన్నా జన్మభూమి కమిటీల సిఫార్సులు కావాల్సి వచ్చేదని, అదికూడా ఆపార్టీ వారికే అందేదని విమర్శించారు. జగనన్న పాలనలో అర్హత ఉంటే చాలు పింఛన్ మంజూరు కావడంతోపాటు ఒకటో తేదీనే ఇంటి వద్దకే పింఛన్ మొత్తం అందిస్తున్నట్లు తెలిపారు. మరింత అభివృద్ధి కోసం 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరారు. సంక్షేమ బావుటా కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్‌లు సుబ్రమణ్యం, మోహనప్రియ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా నాయకుడు సుధీర్ కుమార్, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, పార్టీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్ యాదవ్, మాజీ అధ్యక్షుడు నాగార్జున రెడ్డి, నాయకులు మధు యాదవ్, రాజా, జీపీ యాదవ్, షేక్ మస్తాన్, శ్రీమంతుల రామయ్య ఆచారి, గురునాథం, సునీల్, ప్రభాకర్‌రెడ్డి, సయ్యద్ కరీముల్లా, వెంకటేష్, అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

జనమంతా జగనన్న వెంటే..


కనపర్తిలో కరపత్రాలు అందిస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి

- జగనన్నతోనే సంక్షేమం అంటున్నారు
- 'సిద్ధం'లో బియ్యపు శ్రీవాణిరెడ్డి

శ్రీకాళహస్తి: మరోసారి వైఎస్సార్ సీపీకి ఓటు వేసి జగనన్నను సీఎంగా చేసేందుకు శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి శ్రీవాణిరెడ్డి అన్నారు. బుధవారం సిద్ధం కార్యక్రమంలో భాగంగా తొట్టంబేడు మండలం పెద్దకనపర్తి పంచాయతీ పెద్దకనపర్తి, దళితవాడ, చిన్న కనపర్తి, దళితవాడ, మల్లీశ్వరపురం గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలతో పొందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడికి వెళ్లినా పథకాల లబ్ధితో తామంతా ఆనందంగా ఉన్నామని, జగనన్ననే మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని ప్రజలు చెప్పడం గర్వకారణంగా ఉందని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కావాలంటే మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని ప్రజలు నమ్ముతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా బియ్యపు మధుసూదన్‌రెడ్డి గెలిచిన అనంతరం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని, శ్రీకాళహస్తిలో కార్యాలయం ఏర్పాటు చేసి ప్రజా సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరిస్తున్నారని తెలిపారు. గత ఎన్నికల అనంతరం కనిపించని నేతలు నేడు ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రజలను మభ్య పెట్టేందుకు వస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉన్నం వాసు నాయుడు, ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ, సర్పంచ్ విమల, నాయకులు మణిబాబునాయుడు, వీరాస్వామి, ప్రసాద్, నాగరాజు, గంగయ్య, పురుషోత్తం, శివ, రాజా, పెంచలయ్య, ప్రవీణ, చంద్రబాబు, దాము, మునిరత్నం, గెరటారెడ్డి, శంకరయ్య, రవీందర్‌రెడ్డి, భక్తవత్సలం, రమణయ్య నాయుడు, కోవిచంద్రయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గోశాలకు పశుగ్రాసం వితరణ


ఆలయానికి అందిన గడ్డిమోపులు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలోని శ్రీసర్వమంగళ సమేత పళ్లికొండేశ్వర స్వామి దేవస్థానం గోశాలకు బుధవారం రూ. 26 విలువజేసే ట్రాక్టర్ పశుగ్రాసం (125 గడ్డి మోపులు) వితరణగా అందింది. నింద్రకు చెందిన శ్రీరంగం మిల్క్, శ్రీశ్రీనివాస మిల్క్ ప్రైవేటు లిమిటెడ్ యాజమాన్యం వితరణగా అందించింది. సంస్థ ప్రతినిధులకు ఆలయ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం


రామచంద్రయ్య, జగన్నాథం

బుచ్చినాయుడుకండ్రిగ: ఎస్టీయూ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి యువశ్రీమురళి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా రోసనూరు రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా జగన్నాథం, కోశాధికారిగా నల్లపాటి సురేష్, గౌరవాధ్యక్షుడిగా పట్టాభిరెడ్డిని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

ప్రిన్సిపల్ బాధ్యతల స్వీకరణ


అనిల్ కుమార్

నాగలాపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా అనిల్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్క డ పనిచేస్తున్న ఏ.స్వర్ణలత తిరుపతి జిల్లా డీఐఈఓగా పదోన్నతి పొందిన విషయం తెలిసిందే. సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న అనిల్‌కుమార్ పదోన్నతిపై ఇక్కడికి ప్రిన్సిపాల్‌గా వచ్చారు.

డిగ్రీ కళాశాలలో ఓపెన్‌డే రేపు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్పీవీ పురుషుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఓపెన్‌డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీలత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల విద్యార్థులు తమ కళాశాలను సందర్శించి ల్యాబ్, లైబ్రరీ, హాస్టల్, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ, జేకేసీ, వసతులను తెలుసుకుంటారని పేర్కొన్నారు. విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తహసీల్దార్‌కు వీడ్కోలు సన్మానం


సన్మానం అందుకున్న ప్రసన్నకుమార్

నాగలాపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తిరుపతి కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయిన తహసీల్దార్ ప్రసన్న కుమార్‌ను బుధవారం ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సత్కరించారు. తహసీల్దార్ కార్యాలయం జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిన్నదొరై సుధా, ఎంపీడీఓ పీఎంకే బాబు, వీఆర్వో నాగభూషణం, పలువురు ప్రజాప్రతినిధులు సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. ఎంపీపీ సింధూ శ్యామ్, వైస్ ఎంపీపీ కుమారి ఉదయ్ కుమార్ రెడ్డి, పళ్లికొండేశ్వరస్వామి ఆలయ ట్రస్టుబోర్డు సభ్యుడు ఎస్ఎం సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీకి రూ.13.39 లక్షల ఆదాయం

సత్యవేడు: సత్యవేడు పంచాయతీకి వివిధ నిర్వహణల వేలం ద్వారా రూ.13.39 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈఓపీఆర్డీ ముని రవి కుమార్ తెలిపారు. మంగళవారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వేలం ద్వారా వారపు సంతకు రూ. 4.30లక్షలు, ప్రైవేట్ బస్టాండ్‌కు రూ. 2,16,550, జంతు వధశాలకు రూ.43,500, షాపింగ్ గదులు(10) రూ.6.26 లక్షలు, నేల బాడుగకు రూ.18వేలు ఆదాయం వచ్చినట్లు వివరించారు.

సత్యవేడు సీఐగా దివాకర్‌రెడ్డి



సత్యవేడు: సత్యవేడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.దివాకర్ రెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. శ్రీకాకుళం నుంచి ఆయన ఇక్కడికి బదిలీ అయ్యారు. ఆయన విలేకరులతో మాట్లాడుతు సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. తమళనాడు సరిహద్దు కావడంతో అక్రమ రవాణాను అరికడుతామని తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ఏర్పేడు: మండలంలోని ముసలిపేడు బీసీ కాలనీలో 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, అక్రమ విక్రేతను అరెస్టు చేసినట్లు సీఐ శ్రీరామ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ జిలానీ ముసలిపేడు బీసీ కాలనీలో బాలకృష్ణ ఇంటిలో దాడి చేయగా గోనె సంచిలోని 15 మద్యం బాటిళ్లను గుర్తించినట్లు పేర్కొన్నారు. నిందితుడితో పాటు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

- నియోజకవర్గంలో 279 బూత్‌లు
- రిటర్నింగ్ అధికారి రామ్మోహన్
- తహసీల్దార్లు, నాయకులు సమావేశం


మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి రామ్మోహన్

సత్యవేడు: నియోజకవర్గంలో ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలని, పోలింగ్ బూత్‌లకు కేటాయించిన నంబర్లను అందరికీ కనిపించేలా పెయింట్‌తో వేయించాలని తహసీల్దార్లకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.రామ్మోహన్ సూచించారు. మంగళవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో ఏడు మండలాల తహసీల్దార్లు, పార్టీ నాయకులతో ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఆర్ఓ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ కోసం నియోజక వర్గ పరిధిలో 279 కేంద్రాలను కేటాయించామని తెలిపారు. సత్యవేడు మండలానికి 35, వరదయ్యపాళెం 46, కేవీబీపురం 44, నారాయణవనం 39, పిచ్చాటూరు 32, నాగలాపురం 33, సత్యవేడు మండలానికి 50 కేంద్రాలను కేటాయించామన్నారు. నియోజకవర్గ పరిధిలో పురుషులు 1,02,568 మంది, స్త్రీలు 108797 మంది, థర్డ్ జండర్‌లు 13 మంది ఉన్నారన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వికలాంగులు సులభంగా వచ్చి ఓటు వేసేందుకు ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రాల్లో విద్యుత్ వసతి, మరుగుదొడ్డి, నీటి వసతి సదుపాయాల సమాచారం ఇవ్వాలన్నారు. పోలింగ్ సిబ్బంది, ఏజెంట్లు కూర్చునేందుకు ఫర్నిచర్ సమగ్రంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇప్పటి నుంచే వసతుల ఏర్పాటుపై దృష్టి సారించాలని తెలిపారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల వివరాలు అందించాలని పోలీసులకు సూచించారు. సీఐ ఎం.దివాకర్ రెడ్డి, ఎస్ఐ వీరాంజనేయులు, తహసీల్దార్ రామాంజనేయులు(సత్యవేడు), శ్రీనివాసులునాయక్(కేవీబీపురం), ఉదయభారతి(వరదయ్యపాళెం), రవిశంకర్(నారాయణవనం), బి. హుసేన్‌సాహెబ్ (పిచ్చాటూరు), డీటీ రవి చంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్యాప్రసాద్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, టీడీపీ నాయకుడు మన్నెం శివయ్యశెట్టి, బీజేపీ నాయకుడు మోహన్ బాబు పాల్గొన్నారు.

ఉపాధిలో వంద రోజులు పని కల్పించాలి


పనులను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

ఏర్పేడు: ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డులున్న ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని రాజులపాలెంలో ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో వంద మంది కూలీలు తగ్గకుండా పనులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రైతుల పొలాల్లో పండ్లు, పూల తోటల పెంపకం చేపట్టాలని సూచించారు. అమృత్ సరోవర్ నిర్మాణాలతో భూగర్భ జలాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. కూలీలకు రూ.272 వేతనం వచ్చేలా కొలతలు ఇవ్వాలని తెలిపారు. ఏపీఓ దేవరి, సాంకేతిక సహాయకుడు మనోహర్ పాల్గొన్నారు.

తహసీల్దార్ల బాధ్యతల స్వీకారం


వీరాంజనేయులు, సత్యవేడు

సత్యవేడు: సత్యవేడు తహసీల్దార్‌గా కె.వీరాంజనేయులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా ఆలూరు నుంచి ఆయన ఇక్కడికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ సమస్యలను వేగవంతంగా పరిష్కరిస్తామని తెలిపారు.


హుస్సేన్ సాహెబ్, పిచ్చాటూరు

పిచ్చాటూరు: పిచ్చాటూరు తహసీల్దార్‌గా డి.హుస్సేన్ సాహెబ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆయన కర్నూలు నుంచి ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న మధుసూదన్‌రావు కడప జిల్లాకు బదిలీ అయ్యారు. హుస్సేన్ సాహెబ్ మాట్లాడుతూ అందరి సహకారంతో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు.

భగవద్గీత ప్రవచనాలు ప్రారంభం


ప్రవచనం చేస్తున్న యోగిని చంద్రకాళి ప్రసాద మాతాజీ

శ్రీకాళహస్తి: పట్టణంలోని ముత్యాలమ్మగుడి కల్యాణ మండపంలో బుధవారం శుకబ్రహ్మాశ్రమం ఆధ్వర్యంలో శ్రీమత్ భగవద్గీత ప్రవచనాలు ప్రారంభమయ్యాయి. ఆశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపానంద గిరిస్వామి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. యోగిని చంద్రకాళీ ప్రసాద మాతాజీ శ్రీమత్ భగవద్గీత సప్తాహంలో భాగంగా 5వ అధ్యాయాన్ని వినిపించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రవచనాలు ఏడు రోజులపాటు రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు ఉంటాయని ఆశ్రమ ప్రతినిధులు తెలిపారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్న ఎంపీడీఓ, వైద్యాధికారి

నాగలాపురం: ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ పీఎంకే బాబు సమక్షంలో వైద్య సిబ్బందికి డాక్టర్ అరుణ్ కిషోర్ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 9వ తేదీన నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలోని పిల్లలకు 9వ తేదీ మధ్యాహ్న భోజనం అనంతరం వయసుకు తగిన మోతాదులో మాత్రలు మింగిస్తామని తెలిపారు. సర్పంచ్ చిన్నదొరై సుధా, జెడ్పీటీసీ సుమతి, వైస్ ఎంపీపీ సింధూ శ్యామ్, నాయకులు, మదన్‌మోహన్‌రెడ్డి, దేశప్పన్, దానివేలు, ఏలుమలై పాల్గొన్నారు.

శాశ్వత పనులకు ప్రాధాన్యం ఇవ్వండి


మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రవీంద్రబాబు

సత్యవేడు: పంచాయతీలకు మంజూరైన 15 ఆర్థిక సంఘం నిధులను ప్రాధాన్యత కలిగిన శాశ్వత పనులకు ఉపయోగించాలని డీఎల్‌పీఓ రవీంద్రబాబు అన్నారు. మంగళవారం సత్యవేడు సచివాలయంలో సర్పంచ్ పి.మంజుల అధ్యక్షతన సమావేశం జరిగింది. డీఎల్‌పీఓ మాట్లాడుతూ పంచాయతీలో చేపట్టే పనులకు సంబంధించిన బిల్లులు ఈ– పోర్టల్‌లో తప్పక నమోదు చేయాలన్నారు. డ్రైనేజీలు, కల్వర్ట్‌లు, రహదారులు, కరెంటు బిల్లులు, హెల్త్ సెంటర్, అంగన్‌వాడీ భవనాల ఆధునీకరణకు కూడా వినియోగించుకోవచ్చన్నారు. ముఖ్యంగా రానున్న వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా పైప్‌లైన్లు, చేతిపంపుల మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. ప్రతి పనికి బిల్లులు సమర్పించాలన్నారు. ఈఓపీఆర్డీ ముని రవికుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు రమేష్, సెక్రటరీలు హరీష్,వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తులు

శ్రీకాళహస్తి: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 2024–25 విద్యాసంవత్సరానికి ఇంగ్లిష్ మీడియంలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.ప్రభావతి తెలిపారు. ఈనెల 23వ తేదీ లోపు http://apdragcet.apcfss వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఫోన్ నంబరు, రేషన్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశపరీక్ష మార్చి 10న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 5వ తరగతికి, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఇంటర్మీడియట్‌కు ప్రవేశ పరీక్ష జరుగుతుందని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆమె పేర్కొన్నారు.

వీరరాఘవస్వామి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం


గణపతి పూజలో పాల్గొన్న భక్తులు

నారాయణవనం: మండల కేంద్రంలో శ్రీకనకవల్లీ, వేదవల్లి సమేత వీర రాఘవస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు బుధవారం రాత్రి విఘ్నేశ్వర పూజతో శ్రీకారం చుట్టారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు ఆలయాన్ని విద్యుద్దీపాలు, అరటిచెట్లు, మామిడి ఆకుల తోరణాలతో సుందరంగా అలంకరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గురువారం ఉదయం కలశ పూజతో అంకురార్పణ జరుగుతుందని తెలిపారు. సాయంత్రం కల్యాణం, రాత్రి తిరువీధి ఉత్సవం, శుక్రవారం సాయంత్రం అన్నమాచార్య సంకీర్తన లహరి, సాంస్కృతిక కార్యక్రమాలు, ఊంజల్‌సేవ, రాత్రి గరుడసేవ, శనివారం ఉదయం హనుమంత వాహన సేవ ఉంటుందని పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం చక్రస్నానంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు జరిగే పుష్పయాగంలో భక్తులందరూ పాల్గొని తీర్థ ప్రసాదాలను అందుకోవాలని కోరారు.

ఆగమోక్తంగా ప్రదోష నందిసేవ



శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం ప్రదోష నందిసేవ వైభవంగా జరిగింది. ముందుగా శ్రీస్వామి,అమ్మవార్లకు అలంకార మండపంలో పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రాలు,మంగళవాయిద్యాలు, మేళ తాళల నడుమ స్వామి, అమ్మవార్లను చిన్న నందిపై అధిష్టింపచేసి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. భక్తులు దర్శించి తరించారు.
- శ్రీకాళహస్తి

ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించండి


చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్టీసీ యూనియన్ నాయకులు

శ్రీకాళహస్తి: తమకు శ్రీకాళహస్తీశ్వరస్వామి ప్రత్యేక దర్శన భాగ్యం కల్పించాలని ఆర్టీసీ ఉద్యోగులు కోరారు. బుధవారం ఆలయంలో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులును కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుమలలో తిరుమల డిపోకు చెందిన ఆర్టీసీ ఉద్యోగ, కండక్టర్, డ్రైవర్లకు ప్రత్యేక ఐడీ కార్డులు మంజూరు చేసి ప్రత్యేక దర్శనం కల్పిస్తున్నట్లే తమకు, తమ కుటుంబ సభ్యులు ఇక్కడ అవకాశం కల్పించాలని కోరారు. చైర్మన్ స్పందిస్తూ ఈఓ, దేవదాయశాఖ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి కార్డులు మంజూరు చేసి, దర్శన భాగ్యం కల్పించేలా చూస్తామని తెలిపారు. ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పీఎస్ కుమార్, జీపీఎన్ ఆచారి, మాధవాచారి, కుమార్, ప్రసాద్, కేసీరెడ్డి, నరసింహులు, సునీల్‌కుమార్, అశోక్‌కుమార్, ఉదయ్, వెంకటాద్రి, కిషోర్, లింగమూర్తి, షణ్ముగం, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం–ఆంధ్ర విజేతలకు అభినందన



కప్పులు, ప్రశంసా పత్రాలు పొందిన క్రీడాకారులతో అధికారులు, ప్రజాప్రతినిధులు

పిచ్చాటూరు: ఆడుదాం–ఆంధ్ర క్రీడా పోటీల్లో నియోజకవర్గ స్థాయి విజేతలుగా నిలిచిన పిచ్చాటూరు మండల క్రీడాకారులను అధికారులు, ప్రజాప్రతినిధులు బుధవారం అభినందించారు. సాయంత్రం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసులు అధ్యక్షతన అభినందన సభ జరిగింది. సింగిల్ విండో చైర్మన్ కెటీ హరిశ్చంద్రారెడ్డి మాట్లాడుతూ బ్యాడ్మింటన్‌లో పిచ్చాటూరు యువకులు కిషోర్, మధు జట్టు సత్తాచాటిందన్నారు. క్రికెట్‌లో కారూరు జట్టు రన్నర్స్‌గా, కబడ్డీ పోటీల్లో కీళపూడి జట్టు ద్వితీయ స్థానంలో, క్రికెట్ మహిళ విభాగంలో పిచ్చాటూరు జట్టు రన్నర్స్‌గా నిలవడం అభినందనీయమన్నారు. అనంతరం క్రీడాకారులను అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. వైస్ ఎంపీపీ విజయమ్మ, ఎంఈఓ యుగంధర్ రాజు, ఏఓ రాధారాణి, పీఈటీ అములు, సర్పంచ్‌లు సతీష్, భూపతి, జేసీఎస్ కన్వీనర్ తొప్పయ్య, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నాయకుడు మునిరాజ, నాయకులు రాజ, వెంకటేశన్, పాల్గొన్నారు.

సిపాయి భరోసా అందజేత


సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సుబ్రమణ్యం

ఏర్పేడు: మండలంలోని బండారుపల్లెలో రాజేష్ కుటుంబానికి బుధవారం సిపాయి భరోసా అందింది. రాజేష్(43) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం బుధవారం గ్రామానికి వెళ్లి తన ఆధ్వర్యంలో నడుస్తున్న సిపాయి భరోసా కింద ఏడాదికి సరిపడే 52 రకాల నిత్యావసర సరకులను బాధిత కుటుంబానికి అందజేశారు. డాక్టర్ బాబు, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి మునికృష్ణారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నంరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మృతుడు ముచ్చువోలు వాసి

ఏర్పేడు: మండలంలోని దుర్గిపేరి పొలాల్లో మంగళవారం వేప చెట్టుకు చొక్కాతో ఉరేసుకున్న వ్యక్తి ఆచూకీని గుర్తించినట్లు సీఐ శ్రీరామ శ్రీనివాసులు బుధవారం రాత్రి తెలిపారు. శ్రీకాళహస్తి మండలం ముచ్చువోలుకు చెందిన చెంచురామయ్య(45)గా బంధువులు గుర్తించినట్లు చెప్పారు. చెంచురామయ్య మృతి అనుమానాస్పదంగా ఉందని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.